సాక్షి
కుమురం భీం
మంగళవారం । 5 । ఆగస్టు । 2025



సబ్ కలెక్టర్ పూజలు

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సోమవారం పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్‌శర్మ తీర్థ ప్రసాదాలు అందించారు.



బెంబేలెత్తిస్తున్న కుక్కలు

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో కుక్కల బెడద పెరిగింది. రోడ్లపై వెళ్తున్న వారిని వెంబడించి శునకాలు గాయపరుస్తున్నాయి. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.6 /26.3

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాక

ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు బుధవారం జిల్లాకు రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ టాటియా గార్డెన్స్‌లో నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారని, అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతారని పేర్కొన్నారు. జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, మేధావులు, రిటైర్డ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, అన్నివర్గాల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

డిప్యూటీ కలెక్టర్‌గా రేవయ్య



రేవయ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థి డొంగ్రె రేవయ్య ఐఏఎస్ శిక్షణ అనంతరం మహారాష్ట్రలో వర్ధా డిప్యూటీ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం నిర్వహించిన లెక్చర్ ఆఫ్ లైఫ్ కార్యక్రమానికి హాజరైన ఆయనను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రేవయ్య మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న వసతులు సద్వినియోగం చేసుకోవాలని, జీవితంలో ఉన్నత లక్ష్య సాధనకు కష్టపడాలని సూచించారు. ప్రిన్సిపాల్ యాదగిరి మాట్లాడుతూ గురుకుల పాఠశాల విద్యార్థి రేవయ్య ప్రణాళిక ప్రకారం కష్టపడి చదివి యూపీఎస్సీ పరీక్షలో ర్యాంక్ సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులు రేవయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రహీం, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సంతోష్, కాళేశ్వరం జోన్ స్పోర్ట్స్ అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ పేపరు మిల్లులో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పట్టణంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కు విద్యార్థి నిరుద్యోగ జేఏసీ నాయకులు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ మిల్లులో స్థానికేతరులు 75 శాతం మంది ఉద్యోగులుగా పని చేస్తున్నారని, స్థానికులు కేవలం 25 శాతం మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఒకే రకమైన పనికి స్థానికేతరులకు ఎక్కువ, స్థానికులకు తక్కువ వేతనం చెల్లిస్తున్నారని ఆరోపించారు. గతంలో విధులు నిర్వర్తించిన కార్మికులను విధుల్లోకి తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పొన్న రమేశ్, సాయికృష్ణ, హైమద్, అఖిల్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ వందశాతం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అబిద్ అలీ

తిర్యాణి: ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) అటెండెన్స్ యాప్‌లో ఉపాధ్యాయులు వందశాతం రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చూడాలని విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ అబిద్ అలీ అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో అంజయ్యతో కలిసి సోమవారం ఎంఆర్ సిబ్బంది, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, ఐఈఆర్‌పీలకు ఎఫ్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా ప్రతీ ఉపాధ్యాయుడు హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రెబ్బెన: ఫేస్ రికగ్నిషన్ హాజరును ప్రతీరోజు పర్యవేక్షించాలని జిల్లా సమగ్ర శిక్ష ఏఎస్‌వో అధికారి అబిద్ అలీ అన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్‌తో కలిసి సోమవారం రెబ్బెన కాంప్లెక్స్ పాఠశాలలను సందర్శించారు. టీచర్ల ముఖ గుర్తింపు హాజరు రిజిస్టర్ పరిశీలించారు.

మార్పు వచ్చేనా..?

- విద్యాధికారి పోస్టులో రెండేళ్లుగా ఇన్‌చార్జీలే..
- తొలిసారి ఐఏఎస్ అధికారికి బాధ్యతలు
- డీఈవోగా అదనపు కలెక్టర్ దీపక్ తివారి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా విద్యాధికారిగా రెండేళ్లుగా ఇన్‌చార్జీలనే నియమిస్తుండగా, తొలిసారి ఐఏఎస్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. సరైన పర్యవేక్షణ లేక కుంటుపడుతున్న విద్యా వ్యవస్థను ఆయన చక్కదిద్దుతారని సర్వత్రా ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఏళ్లుగా ఇన్‌చార్జీలే..

జిల్లా డీఈవో, డీఎండబ్ల్యూవో, డీబీసీడబ్ల్యూవో, డీఎస్‌వో, డీఐఈవో.. ఇలా అనేక పోస్టుల్లో రెగ్యులర్ అధికారులను నియమించకుండా ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్నారు. 2023 నుంచి జిల్లాకు రెగ్యులర్ విద్యాధికారి సైతం లేరు. మంచిర్యాల డీఈవో యాదయ్య ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో పాఠశాలలపై పర్యవేక్షణ లోపించి విద్యార్థులు నష్టపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఎంఈవో పోస్టుల్లోనూ ఇన్‌చార్జీలే ఉన్నారు. సీనియారిటీ కలిగిన పీజీ హెచ్‌ఎంలు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు మండల అధికారులుగా బాధ్యతలు అప్పగించారు. ఇదే తరహాలో ఇంటర్ ప్రభుత్వ కళాశాలలు 11 ఉండగా.. అందులో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు ఉన్నారు. మిగతా 9 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. డీఐఈవోగా కాగజ్‌నగర్ కళాశాల ప్రిన్సిపాల్ కళ్యాణి కొనసాగుతున్నారు.

బదుల బలోపేతంపై దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం సర్కారు విద్యను బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. పాఠశాలల్లో ఏఐ పాఠాలు బోధించడంతోపాటు ఎంపిక చేసిన స్కూళ్లలో ఏఐ విద్యను ప్రవేశపెట్టారు. అలాగే ఉపాధ్యాయుల అనధికార గైర్హాజరును అరికట్టేందుకు ఈ నెల 1 నుంచి ముఖ గుర్తింపు హాజరు అమలు చేస్తున్నారు. ఐఏఎస్ అధికారి జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు తీసుకోవడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అక్రమాలకు చెక్ పడుతుందని చర్చించుకుంటున్నారు. అదనపు కలెక్టర్ చొరవ తీసుకుంటనే ఫలితం కనిపిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

పదో తరగతి ఫలితాల్లో నిరాశ

కొన్నేళ్లుగా పదో తరగతి ఫలితాలు ఆశించిన తీరుగా లేవు. రాష్ట్రంలో చివరి నుంచి 1, 2 స్థానాలకు జిల్లా పరిమితం కావడం ఆందోళన కలిగిస్తుంది. 2021- 22 విద్యా సంవత్సరంలో 79 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 32వ స్థానం, 2022- 23లో 75 శాతం ఉత్తీర్ణతతో 30వ స్థానం, 2023- 24లో 83 శాతం ఉత్తీర్ణతతో 31వ స్థానం, ఇక గత విద్యా సంవత్సరంలో 87 శాతం పాస్ పర్సెంటేజీతో రాష్ట్రస్థాయిలో జిల్లా 32వ స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

విద్యా సామర్థ్యాల్లోనూ వెనుకంజ..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 721 ఉండగా, 39,246 విద్యార్థులు ఉన్నారు. అభ్యసన సామర్థ్యాలు సాధించడంలో జిల్లా విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. గతేడాది డిసెంబర్‌లో జాతీయస్థాయిలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు మొత్తం తొమ్మిది పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీఈఆర్టీ విడుదల చేసిన ఫలితాల్లో జిల్లా అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయింది. 79 పాఠశాలల్లో 2,137 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మూడో తరగతికి సంబంధించి తెలుగులో జిల్లాకు 52వ స్థానం, గణితంలో 49, 6వ తరగతి తెలుగులో 46, గణితం 41, పరిసరాల విజ్ఞానంలో 41వ స్థానం, 9వ తరగతిలో తెలుగు 50, గణితం 33, సైన్స్ 36, సాంఘిక శాస్త్రంలో 36వ స్థానంలో నిలిచింది. పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్- 2024 నివేదికలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కుమురంభీం ఆసిఫాబాద్ అట్టడుగున ఉంది.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ



కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్: ఆదివాసీ గిరిజనుల సంక్షేమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంపూర్ణతా అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించి అవార్డు స్వీకరించిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు అభినందనలు వెల్లువెత్తాయి. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, కలెక్టరేట్ ఏవో కిరణ్‌కుమార్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపి శాలువాలతో సత్కరించారు.

ఆశ్రమాలు, గ్రామాలను సందర్శించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వర్షాకాలం నేపథ్యంలో వైద్యసిబ్బంది ఆశ్రమ పాఠశాలలు, గ్రామాలను సందర్శించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ప్రాథమిక ఉప కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. వార్డులు, రిజిస్టర్లు, పరిసరాలు పరిశీలించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే ఫ్రైడే నిర్వహించాలని సూచించారు. జ్వరపీడితులను గుర్తించి వైద్యం అందించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించి, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండలంలోని బూర్గుడ మండల పరిషత్ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఐదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పఠన సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు.

బతికుండగానే చంపేశారు..!

- తప్పుడు ధ్రువపత్రాలతో భూమి కబ్జా
- న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వృద్ధురాలి వేడుకోలు



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

కాగజ్‌నగర్‌టౌన్: బతికుండగానే చనిపోయినట్లుగా రికార్డులు సృష్టించి తన భూమిని కాజేశారని ఓ వృద్ధురాలు సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. చింతలమానెపల్లి మండలం డబ్బాకు చెందిన చాపిడి సోమబాయి అనే వృద్ధురాలు కార్యాలయం ఎదుట ఇద్దరు కుమార్తెలతో కలిసి ధర్నా చేసింది. డబ్బాలోని మెయిన్ అడ్డాలో 26 గుంటల భూమిని కొంత మంది కబ్జా చేశారని ఆరోపించింది. తాను చనిపోయినట్లుగా ఫేక్ డెత్ సర్టిఫికెట్ సృష్టించి భూమి రిజిస్టర్ చేసుకున్నారని తెలిపింది. తన భర్త గతంలోనే చనిపోగా, కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడలో కుమార్తెల వద్ద ఉంటున్నానని పేర్కొంది. భూమి ఇతరులకు రిజిస్టరైన విషయం ఆలస్యంగా తెలిసిందని, తప్పుడు ధ్రువీకరణ పత్రం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకుని రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరింది. సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీపీఎం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ వృద్ధురాలికి మద్దతు పలికారు.

పెన్షన్ ఇస్తారా.. రాజీనామా చేస్తారా

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు పెన్షన్ ఇస్తారా.. రాజీనామా చేస్తారా అనే నినాదంతో పింఛన్ల పెంపుకోసం ముందుకెళ్లాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జనకు జిల్లాలోని దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఒడ్డెపల్లి గార్డెన్‌లో సోమవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సదస్సులో మాట్లాడారు. గత 20 నెలలుగా దివ్యాంగుల పెన్షన్ పెంచకపోవడంతో ప్రభుత్వానికి రూ.20 వేల కోట్లు మిగిలాయని, ఆ మొత్తాన్ని రైతు భరోసాకు కేటాయించినట్లు ఆరోపించారు. పెన్షన్ పెంపు గురించి ప్రశ్నించని ప్రతిపక్ష నేత కేసీఆర్ రైతు భరోసాకు మరో రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేయడం దారుణమన్నారు. పింఛన్ రూ.4000 నుంచి రూ.6 వేలకు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి పెన్షన్‌దారులు స్వచ్ఛందంగా పెన్షన్ నుంచి రూ.వెయ్యి కేటాయించాలని కోరారు. హైదరాబాద్‌ను దిగ్బంధం చేసేవిధంగా మహాగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మందకృష్ణను శాలువాతో దివ్యాంగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు ఇస్లాంబిన్ హసన్, జిల్లా ఇన్‌చార్జి పెద్దపల్లి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు బన్న మూర్తి, నాయకులు శ్రీనివాస్, అనిల్, పెంటు, రాజయ్య, పెంటయ్య, ఖయ్యూం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కౌటాల మండలం గుడ్లబోరికి చెందిన వృద్ధుడు బడికె సదాశివ్ వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రెబ్బెన మండలం పులికుంటలోని చేనులో పత్తి పంటను ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తక్కల్లపల్లికి చెందిన నంది రజిత ఫిర్యాదు చేసింది. ఆసిఫాబాద్ మండలంలోని అడ ప్రాజెక్టులో కోల్పోయిన పట్టా భూమికి నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌కు చెందిన పోరెండ్ల రాజేశ్వర్ దరఖాస్తు చేసుకున్నాడు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని జిల్లా కేంద్రంలోని బజార్‌వాడికి చెందిన దిందా లక్ష్మి, రెబ్బెన మండలం గోలేటికి చెందిన సుగుణ వేర్వేరుగా విన్నవించారు. వాంకిడి మండలం ఖమాన నుంచి ఖనర్గాం వెళ్లే దారిని ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఖమాన గ్రామానికి చెందిన వసాకె రాధాబాయి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.

వితంతు పింఛన్లు ఇవ్వాలి



మేము ఆదివాసీ గిరిజన మహిళలం. భర్తలను కోల్పోయిన ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాము. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– వెడ్మ జంగుబాయి, దుర్వ గోదుబాయి, గిన్నెధరి, మం.తిర్యాణి

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



'మేమంతా పక్కా ఇళ్లు లేక పూరిగుడిసెల్లో నివసిస్తున్నాం. విద్యుత్, తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో 20 కుటుంబాలు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే మూడుసార్లు దరఖాస్తు చేసుకున్నాం. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి..' అని సిర్పూర్(యూ) మండలం భీమ్‌గూడకు చెందిన ఆదివాసీ మహిళలు నవనీత, సునీత, నాగుబాయి, పార్వతిబాయి తదితరులు కలెక్టర్‌ను వేడుకున్నారు.

సీఆర్టీ నియామకంలో అన్యాయం



ఐటీడీఏ ఆధ్వర్యంలో 2023లో సీఆర్టీల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్కూల్ అసిస్టెంట్ హిందీలో నాకు 30 మార్కులు వచ్చాయి. నా కంటే తక్కువ 22 మార్కులు వచ్చిన అభ్యర్థిని సీఆర్టీగా నియమించారు. నేను లింగాపూర్‌లోనే విద్యాభ్యాసం చేయడంతో స్థానికత కూడా ఉంది. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలి.

– జాదవ్ అంబాజీ, లింగాపూర్

పట్టా పాస్‌పుస్తకం జారీ చేయాలి



జైనూర్ మండలం ఉషేగాం శివారులో సర్వే నం.22/104లో 4.17 ఎకరాల పట్టా భూమి ఉంది. కొత్త పట్టా పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నా ఇవ్వడం లేదు. పాస్‌పుస్తకం జారీ చేసి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

– పెందూర్ జంగు, దుబ్బగూడ, మం.జైనూర్

పింఛన్ కోసం ఐదేళ్లుగా తిరుగుతున్నా



నాకు కుడి కాలు వంకరగా ఉండడంతో నడవలేను. 50 శాతం వికలాంగత్వ సర్టిఫికెట్ ఇచ్చారు. దివ్యాంగుల పింఛన్ కోసం ఐదేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. ప్రభుత్వం స్పందించి పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– ధరావత్ రేణుక, తుమ్మగూడ, మం.కెరమెరి

పీపీరావు ప్రాజెక్టు కాలువలో పూడికతీత

సాక్షి ఎఫెక్ట్



జేసీబీతో పీపీరావు ప్రాజెక్టు ప్రధాన కాలువ పూడిక తీస్తున్న దృశ్యం..

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలం కల్వాడ సమీపంలోని పీపీరావు ప్రాజెక్టు కాలువల దుస్థితిపై గత నెల 28న 'సాక్షి'లో సాగునీరు వెళ్లేదెలా..?(అధ్వానంగా పీపీరావు ప్రాజెక్టు కాలువలు) అనే కథనం ప్రచురితం కాగా నీటి పారుదల శాఖ అధికారులు స్పందించారు. ప్రాజెక్టు వద్ద నుంచి ప్రధాన కాలువ పూడికతీత పనులు చేపట్టినట్లు ఏఈ సాయితేజ సోమవారం తెలిపారు. 16 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ ఉండగా ఇప్పటివరకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు పూడిక తీశామని పేర్కొన్నారు. వరినాట్లు కొనసాగుతున్నందున సాగునీరు విడుదల చేసి పనులు నిలిపివేశామన్నారు. మరో రెండు రోజుల్లో పనులు మళ్లీ చేపడతామని ఆయన పేర్కొన్నారు. పూడికతీత పనులు ప్రారంభం కావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్



ఆనంద్‌రావు, శకుంతల దంపతులను అభినందిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్‌అర్బన్: కృషి, పట్టుదల ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపిన ఆసిఫాబాద్ మండలానికి చెందిన ఆనంద్‌రావు, శకుంతల దంపతులను సోమవారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఆదివారం మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగు పందెం, నడక పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు పోలీసుల సేవలు నిర్భయంగా వినియోగించుకోవాలని అన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు రావడం లేదని అన్నారు. అనారోగ్యంతో ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్తే కనీసం వైద్యం అందించడం లేదని తెలిపారు. సుమారు రూ.1.50 కోట్ల వరకు పీఎఫ్ బకాయి ఉందన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్, శంకర్, రమేశ్, రాకేశ్, సాగర్, నివాస్, నారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎనిమిదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎనిమిదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.11వేల జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. 2021లో బాధితుడు నవీద్ అహ్మద్ రైతుబజార్ నుంచి కూరగాయలు తీసుకొని రాంనగర్‌లో గల తన ఇంటివైపు వెళ్తుండగా రణదీవెనగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సురేతార్ సంతోష్ కలెక్టరేట్ చౌరస్తా వద్ద వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో నవీద్ అహ్మద్ మృతి చెందాడు. బాధితుడి తండ్రి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ షాహిన్ సుల్తాన నేరం రుజువు చేయడంతో జడ్జి తీర్పు వెలువరించారు. వాహన యజమాని బమ్మకంటి శివమణికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు వివరించారు. నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

ఒకరికి ఏడాది..

భీమిని: మహిళను వివస్త్రను చేయడమే కాకుండా దుర్భాషలాడినందుకు ఒకరికి ఏడాది జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ బెల్లంపల్లి కోర్టు న్యాయమూర్తి జే.ముఖేష్ సోమవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. 2017లో భీమిని మండలంలోని వీగాం గ్రామానికి చెందిన గాండ్ల అంకమ్మ అదే గ్రామానికి చెందిన ఓ మహిళను వివస్త్రను చేసి, బూతులు తిట్టడంతో బాధిత మహిళ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శేఖర్ కేసు నమోదు చెశారు. కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి


చికిత్స పొందుతున్న చిన్నయ్య

లక్ష్మణచాంద: పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని ఒకరిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని రాచాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గైనం చిన్నయ్య కొన్నేళ్ల క్రితం లక్ష్మణచాందకు ఇల్లరికం వెళ్లాడు. మూణ్నెళ్ల క్రితం తన తల్లి అనారోగ్యానికి గురికావడంతో రాచాపూర్‌కు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద భజనకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన భూషి రాకేష్ పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని చిన్నయ్యను దుర్భాషలాడడమే కాకుండా అతనిపై కర్రతో దాడి చేశాడు. తీవ్రగాయాలు కావడంతో నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి కుమారుడు ముత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.


చోరీ కేసులో నిందితుడు రిమాండ్

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ఏకనాథ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీకి పాల్పడిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవీందర్ సింగ్ తెలిపారు. గుండంపల్లికి చెందిన తోట ప్రవీణ్ ఆదివారం రాత్రి ఆలయ ముఖద్వారానికి ఉన్న తాళం పగులగొట్టి హుండీలో ఉన్న నగదును అపహరించాడు. సోమవారం తెల్లవారు జామున వచ్చిన భక్తులు గమనించి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఆత్మహత్యాయత్నం

సారంగపూర్: సెల్‌ఫోన్ కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన క్లోం సాయన్న–లక్ష్మి దంపతులకు నలుగురు కుమారులు సంతానం. కొంతకాలం క్రితం సాయన్న మృతి చెందగా కుటుంబ బాధ్యతలు తల్లి లక్ష్మి చూసుకుంటోంది. ఈక్రమంలో మూడవ కుమారుడు అయిన శంకర్ కొద్దిరోజులుగా తనకు సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లిని వేధిస్తున్నాడు. వద్దని వారించడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం గ్రామ సమీపంలోని ఓచెట్టుకు ఉరేసుకునేందుకు ప్రయత్నించాడు. అటుగా వెళ్లిన వ్యక్తి గమనించి తాడును కోసేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఎలాంటి ప్రాణాపాయం లేదని స్థానికులు తెలిపారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి


చోరీకి యత్నించిన వ్యక్తి

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామ శివారులో ఉన్న మల్లన్న ఆలయంలో సోమవారం చోరీకి యత్నిస్తున్న వ్యక్తిని అటుగా వెళ్తున్న పలువురు గమనించి దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించడంతో నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు అడిగితే నోరు విప్పడం లేదని, పేరు చెప్పడం లేదని, నిజాంసాగర్‌కు చెందిన వ్యక్తిగా తెలిసిందని పలువురు పేర్కొన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత

- ఆస్పత్రిలో చికిత్స అందించిన సిబ్బంది
- నిలకడగా బాలికల ఆరోగ్యం
- పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో శంకరమ్మ


విచారణ చేపడుతున్న ఎంపీడీవో శంకరమ్మ


చికిత్స పొందుతున్న స్పందన


సంజనకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

రెబ్బెన(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాష్ట్రంలోని పలు గురుకులాల్లో ఇటీవల ఫుడ్ పాయిజన్ సంఘటనలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. రెబ్బెనలోని గురుకుల బాలికల పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో బాలికలు పగలంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. రాత్రి భోజనం ముగించుకుని పడుకోగా.. పదో తరగతి చదువుతున్న స్పందన, సంకీర్తన, సంజన ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సిబ్బంది మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి స్పందన, సంజనను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంకీర్తన ఆరోగ్యం కుదుటపడడంతో బెల్లంపల్లి నుంచి ఇంటికి పంపించారు. మళ్లీ సోమవారం ఉదయం మరో విద్యార్థిని అక్షర సైతం అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను రెబ్బెన పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం బెల్లంపల్లికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శంకరమ్మ సోమవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలతో పాటు పరిసరాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

ఆరోగ్య సమస్యలతోనే అస్వస్థత

బాలికల గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రజిని తెలిపారు. ఆదివారం విద్యార్థులంతా ఆనందంగా ఉన్నారని, రాత్రి భోజనాలు చేసి పడుకున్న తర్వాత ముగ్గురు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. సోమవారం ఉదయం మరో విద్యార్థిని అస్వస్థతకు గురికాగా ఆస్పత్రికి తరలించామన్నారు. బాలికలు గైనక్ సమస్యతో పాటు ఆస్తమా, ఆయాసం వంటి కారణాలతో అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఇదే విషయంపై రెబ్బెన పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్‌ను వివరణ కోరగా.. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగిందని ఇప్పుడే చెప్పలేమని అన్నారు. స్కానింగ్, ట్యూబ్ కల్చర్ పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. కడుపునొప్పి, ఆయాసంతో పీహెచ్‌సీకి రాగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తరలించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'గురుకులం' విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాళ్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 2న శనివారం మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జావెలిన్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ముల్కల్ల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఏ.ఉల్లాస్ జావెలిన్‌త్రోలో బంగారు పతకం, బి.కార్తీక్ పరుగు పందెంలో రజత పతకం, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో కాంస్య పతకం, రిత్విక్ 60 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో రజత పతకం సాధించారు. ఈ నెల 7న జనగామ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పాల్గొననున్నారు. సోమవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారయ్య, ప్రిన్సిపాల్ కుమ్మరి మోహన్, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, పీడీ శ్రీకాంత్, పీఈటీ సాగర్, ఉపాధ్యాయులు అభినందించారు.

న్యాక్ ఏడీ నాగేంద్రం బదిలీ


ఏడీలను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్) ఏడీగా పనిచేస్తున్న నాగేంద్రం హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బెల్లంపల్లికి చెందిన స్వప్నరాణిని ఏడీగా నియమించారు. సోమవారం బదిలీపై వెళ్తున్న ఏడీని, బాధ్యతలు చేపట్టిన నూతన ఏడీలను కార్యాలయ ఉద్యోగులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ సిబ్బంది రమేశ్, దీపక్, మహేష్, తిరుపతి, మేరి విక్టోరియా, తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై సీఐడీకి ఫిర్యాదు

నిర్మల్‌టౌన్: బీసీసీఐ నుంచి క్రికెట్ అభివృద్ధి కోసం విడుదలయ్యే నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా కోచ్ రామరాజు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌లోని వివిధ జిల్లాల కార్యదర్శులతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో సీఐడీకి ఫిర్యాదు చేశారు. పదేళ్లుగా హెచ్‌సీఏ జిల్లాల పేరుతో ఖాతాల్లో నమోదు చేసిన సుమారు రూ.12 కోట్లు దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఇందుకు హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లు, జిల్లా కార్యదర్శులు చేకూరి వెంకట్ (ఖమ్మం), చాగంటి శ్రీనివాస్(వరంగల్), కోదాటి ప్రదీప్ (ఆదిలాబాద్), ఎం.రాజశేఖర్(మహబూబ్ నగర్), ఏ.రాజేందర్‌రెడ్డి (మెదక్), వెంకట్‌రెడ్డి(నిజామాబాద్), ఆగం రావు (కరీంనగర్), సయ్యద్ అమీనుద్దీన్ (నల్గొండ) ఉన్నారని వివరించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నిధులు రికవరీ చేయాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన ఎస్.చరణ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన ఎస్.చరణ్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ రమేశ్ తెలిపారు. హన్మకొండలో ఈనెల 3, 4 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ట్రయాథ్లాన్–ఏ ఈవెంట్లో స్వర్ణ పతకం సాధించాడు. సెప్టెంబర్ 9 నుంచి 11వరకు పాండిచ్చేరిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాడని వెల్లడించారు. అదే విధంగా హన్మకొండ వేదికగా జరిగిన 11వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సోమవారం క్రీడ పాఠశాలకు చెందిన విద్యార్థి శివాని 600 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్ అభినందించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీల భర్తీ

మందమర్రిరూరల్: సీసీసీ (నస్పూర్)లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గానూ సింగరేణి కోటాలో వివిధ కోర్సుల్లో ఇంకా మిగిలి ఉన్న 66 సీట్లను భర్తీ చేయనున్నట్లు యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సివిల్ కోర్సులో 27, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 06, మెకానికల్‌లో 23, మైనింగ్‌లో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసిన తర్వాత ప్రభుత్వ కన్వీనర్ కోటాలో మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 7న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9010222161 నంబర్‌లో సంప్రదించాలని సూచించింది.

పట్టపగలే రూ.5 లక్షలు చోరీ


బాధితుడు ఆనంద్‌గౌడ్


సీసీ కెమెరాలో నమోదైన చోరీ దృశ్యం

భైంసాటౌన్: పట్టపగలే ఓ దుండగుడు స్కూటీ డిక్కీ తెరిచి రూ.5 లక్షలు అపహరించిన ఘటన భైంసా పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. ముథోల్ మండలం ఎడ్‌బిడ్‌కు చెందిన బి.ఆనంద్‌గౌడ్ కూతురు అమెరికాలో ఉంటోంది. ఈ క్రమంలో తండ్రిని అమెరికాకు రప్పించుకునేందుకుగానూ ఆమె తన తండ్రి ఖాతాకు డబ్బు పంపింది. వాటిని డ్రా చేసేందుకు సోమవారం పట్టణంలోని యూనియన్ బ్యాంకుకు వచ్చాడు. బ్యాంక్ నుంచి రూ.5లక్షలు విత్‌డ్రా చేసి స్కూటీ డిక్కీలో పెట్టాడు. కుభీర్ చౌరస్తాలోని సాయిలక్ష్మి బార్‌లో భోజనం చేసేందుకు స్కూటీని బయట నిలిపి లోనికి వెళ్లాడు. ఇదంతా గమనిస్తూ అతన్ని అనుసరించిన దుండగుడు స్కూటీ డిక్కీ తెరిచి నగదును అపహరించుకుపోయాడు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. బాధితుడు బయటకు వచ్చి చూసేసరికి డిక్కీ తెరిచి ఉండడం, నగదు లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ జి.గోపినాథ్ తెలిపారు. సీసీ పుటేజీల ఆధారంగా ఆగంతకుల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు..

- వారం రోజులు కావస్తున్నా ప్రారంభంకాని ప్రక్రియ
- ఓరియంట్ ఎన్నికల ఊసేఎత్తని కార్మికశాఖ

కాసిపేట: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు బేఖాతరయ్యాయి. 15 రోజుల్లో ఎన్నికలు నిర్వహించి 20 రోజుల్లో పూర్తి నివేదికను కోర్టుకు సమర్పించాలని జూలై 28న హైకోర్టు కార్మికశాఖను ఆదేశించింది. వారం రోజులు కావస్తున్నా ఎన్నికల ప్రక్రియ ప్రారంభించక పోవడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం నిర్వహించాల్సిన ఎన్నికలు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో వాయిదా వేస్తూ వస్తున్నారు. దీనిపై కార్మికసంఘం నాయకులు హైకోర్టును ఆశ్రయించగా ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. అయినప్పటికీ డీసీఎల్ దీర్ఘకాలిక సెలవులో ఉందన్న సాకుతో కార్మికశాఖ సాగతీస్తుండగా ఆ శాఖ కమిషనర్ స్పందించక పోవడం, డీసీఎల్ స్థానంలో తాత్కాలికంగా ఇతరులను నియమించక పోవడంపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్మికశాఖ రాజకీయ ఒత్తిళ్లు వీడి ఎన్నికల నిర్వహణకు ముందుకు వస్తుందా? లేక కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

కార్మికులకు జరిగిన అన్యాయాలు సవరించాలి

జైపూర్: జూలై 30, 31వ తేదీల్లో జరిగిన కార్పొరేట్ మెడికల్ బోర్డులో కార్మికులకు జరిగిన అన్యాయాలను వెంటనే సవరించాలని సంస్థ యాజమాన్యాన్ని కోరామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. సోమవారం జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 52 మంది కార్మికుల్లో కేవలం నలుగురిని మాత్రమే మెడికల్ ఇన్‌వాల్యుడేట్ చేయడం, చాలా మందిని ఫిట్ ఫర్ సేమ్ జాబ్ అని చెప్పడం, కొంతమందిని అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ చేసి సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా ఇచ్చారన్నారు. ఇందులో ఆశ్చర్యకరంగా సర్ఫేస్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లను మెడికల్ అన్‌ఫిట్ చేసి సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్‌గా ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి శ్రీనివాస్, పిట్ కార్యదర్శులు నవీన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ సొంతపిల్లల్లా భావించి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ అలుగు వర్షిని సంబంధిత హెచ్‌ఎంలకు సూచించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫుడ్ కమిటీ సభ్యులుగా పిల్లలను నియమించాలని, నెలకోసారి కమిటీలో మార్పులు చేయాలని సూచించారు. రాత్రిపూట మిగిలిన ఆహారాన్ని ఎప్పటికప్పుడు బయట పడేయాలన్నారు. హెచ్‌ఎం, వార్డెన్లు సెలవుపెడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే కలెక్టర్, ఐటీడీఏ పీవో, సంబంధిత ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, డీటీడీవోలు, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీలను ఈ నెల 14 నాటికి పూర్తిస్థాయిలో భర్తీ చేయాలన్నారు.

ప్రహరీ కూలి వలస కూలీ మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు ప్రహరీ గోడ కూలి వలస కూలీ మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలంలోని పోతపల్లి గ్రామానికి చెందిన డోకే లచ్చయ్య (32) సోమవారం మరో ఆరుగురితో కలిసి ప్రహరీగోడ మరమ్మతు పనులు చేసేందుకు వెళ్లాడు. పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి లచ్చయ్య మీద పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై స్థానిక ఎస్సై తిరుపతిని వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు రాలేదన్నారు.

టైగర్‌జోన్‌లో భారీ వాహనాలకు త్వరలోనే అనుమతి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


మంత్రులు సీతక్క, సురేఖతో ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలకు త్వరలోనే అనుమతులు వస్తాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర అటవీ శాఖ వైల్డ్ లైఫ్ బోర్డ్ సమావేశంలో పలు విషయాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రం విలేకరులతో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకకు సహకరించాలని, అటవీ హక్కు చట్టం ప్రకారం అడవిలో ఉండే ఆదివాసీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీలు, ఇతర రైతులను ఇబ్బంది పెట్టవద్దని, పోడు భూముల్లో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు సహకరించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని, బఫర్‌జోన్‌ను రద్దు చేయాలని అటవీశాఖ అధికారులకు సూచించినట్లు తెలిపారు. తాత్కాలికంగా రోడ్లు, వంతెనలకు సహకరించాలని, ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఒంటిద్దు పోకడలకు పోతే ఓపిక నశించి ప్రజలు తిరుగుబాటు చేస్తారని, ఈ విషయంపై ఆలోచించాలని, పై విషయాలపై వైల్డ్‌లైఫ్ బోర్డ్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. త్వరలోనే భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్జీయూకేటీలో యక్షగాన కళా ప్రదర్శన


ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

బాసర: బాసరలోని ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో సోమవారం స్పిక్ మాకే హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో యక్షగాన కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు యువతలో సాంస్కృతిక అవగాహన పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. 'స్పిక్ మాకే' సంస్థ తెలంగాణ 4వ రాష్ట్ర కన్వెన్షన్‌ను ఈ ఏడాది బాసర క్యాంపస్‌లో నిర్వహించడం గర్వకారణమన్నారు. కర్ణాటక నుంచి వచ్చిన కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాకారుడు శ్రీ కేరమనే శివానంద హెగ్డే మాట్లాడుతూ ఇంత గొప్ప వేదికపై ప్రదర్శించటం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా రామాయణంలోని 'సీతాపహరణం' ఘట్టాన్ని ఆధారంగా తీసుకుని, రావణుని అధర్మపు చర్యలు, సీతమ్మ త్యాగం, రామలక్ష్మణుల బాధలను అత్యంత హృద్యంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య మురళీదర్శన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్యను హత్యచేసిన భర్త అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీఐ వేణుచందర్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్

జైపూర్: మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వడం లేదని భార్యను అతి కిరాతకంగా హత్యచేసిన భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణుచందర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని నర్వ గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి గోదారి రాజయ్య మద్యానికి బానిసయ్యాడు. వచ్చిన పెన్షన్ డబ్బులు తాగుడుకు సరిపోకపోవడంతో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న అతని భార్య రాజమణిని తరచూ డబ్బులు ఇవ్వాలని వేధించేవాడు. ఈ విషయంలో ఇద్దరికి తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 2న ఇద్దరి మధ్య జరిగిన గొడవలో కర్రపై రాజమణి తలపై కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక ఎస్సై శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్


మాట్లాడుతున్న ఏఎస్పీ కాజల్ సింగ్

ఉట్నూర్‌రూరల్: ప్రజలు ఇతరులను గుడ్డిగా నమ్మి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని మల్టీ లెవెల్ మార్కెటింగ్‌లో డ్రీమ్ డాలర్ లైఫ్ పేరుతో టోకెన్ ప్యాకెట్ అనే అప్లికేషన్ నందు ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌ను జిల్లా పోలీసులు గుర్తించారన్నారు. ఇందులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. సోమవారం కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని వణికి చెందిన రితేష్ వాతేకర్ ద్వారా ఉట్నూర్ మండలంలోని షాంపూర్‌కు చెందిన చౌకటే సంగ్రామ్, మెండె నారాయణ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌లోని అప్లికేషన్ నందు రూ.1500 కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఇరువురు దాదాపు 11 మందిని చేర్పించగా ఒక్కొక్కరి నుంచి రూ.500 చొప్పున వారికి వెళ్లినట్లు విచారణలో తెలిసిందన్నారు. ప్రజలు మల్టీ లెవెల్ మార్కెటింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రెండు ఎడ్లు, ఆవు అపహరణ


వివరాలు సేకరిస్తున్న ఎస్సై బిట్ల పెర్సిస్

తానూరు(ముథోల్): ముథోల్ మండల కేంద్రంలోని ముక్త దేవి కాలనీలో ఆదివారం రాత్రి హంగిర్గ భోజన్నకు చెందిన రెండు ఎడ్లు, ఒక ఆవును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. భోజన్న తన రెండు ఎడ్లు, ఒక ఆవును సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న నీటి ట్యాంకు కింద కట్టేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వాటిని దొంగిలించారు. గమనించిన బాధితుడు భోజన్న సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై బిట్ల పెర్సిస్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించాడు. పశువుల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కరత్వాడ ప్రాజెక్టు కుడికాలువకు లీకేజీ

- వృథాగా పోతున్న నీళ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు


వృథాగా పోతున్న నీళ్లు

బోథ్: మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు కుడి కాలువకు లీకేజీ ఏర్పడి కొంతకాలంగా నీరు వృథాగా పోతోంది. వర్షాకాలంలో ప్రాజెక్టులో నీటిని ఆపాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాలు లేక ప్రాజెక్టు లోకి నీరు రావడం లేదని, నీరు వృథాగా పోతుండడంతో ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని, రబీ సీజన్‌లో నీటికొరత ఏర్పడే అవకాశం ఉందని వాపోతున్నారు. విషయాన్ని బోథ్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రాజు అనే యువ రైతు, పలువురు రైతులతో కలిసి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టులు చేశారు. దీంతో అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు కుడి కాలువ ద్వారా వెళ్తున్న నీటిని ఆపివేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగల బెడద


బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగల చేతివాటంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి చెందిన కొడారి మంజుల, ఎడ్ల వనిత సోమవారం స్వగ్రామాలకు వెళ్లేందుకు ఖానాపూర్ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు ఎక్కే క్రమంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో ఇదే అదనుగా భావించిన దొంగలు మంజుల పర్సులో ఉన్న రూ.11,300, వనిత పర్సులో ఉన్న రూ.500 నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ చేపట్టారు. పర్సులో నగదుతో పాటు ఏటీఎం కార్డు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫొటోలను చోరీ చేశారని బాధితులు పేర్కొన్నారు.